
సాక్షి కర్నూలు

గురువారం । 11 । జూలై । 2024




సాక్షి గణపతికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై బుధవారం కర్నూలుకు చెందిన ఈశ్వరాంజనేయస్వామి భజన మండలి వారి భజన కార్యక్రమం భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,604
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 27,544
ఔట్‌ఫ్లో(క్యూసెక్కులు)	: 199

న్యూస్‌రీల్

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలు హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలోనే రెండు జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో అజెండాగా వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇరిగేషన్, విద్యుత్ శాఖలపై చర్చ నిర్వహిస్తామన్నారు.

సంజాయిషీ ఇవ్వకుంటే చర్యలు తప్పవు

- జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జెడ్పీ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని, వారు వెంటనే వచ్చి సంజాయిషీ ఇచ్చుకోకుంటే క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకులు కే శ్రీనివాసమూర్తి 2018 ఆగస్టు 10 నుంచి, కోడుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు) రికార్డు అసిస్టెంట్ కే నాగరాజు 2022 డిసెంబర్ 7 నుంచి విధులకు గైర్హాజరయ్యారన్నారు. ఇద్దరు ఉద్యోగులకు తమ కార్యాలయం నుంచి ఇప్పటికే షోకాజ్ నోటీసులు, చార్జ్‌మెమోలు జారీ చేశామన్నారు. అయినా వారు ఎలాంటి సంజాయిషీ ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా వారు వెంటనే స్వయంగా హాజరై సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో ప్రభుత్వ ఉత్తర్వు నెంబర్: 127, తేదీ: 15-09-2017, సీసీఏ రూల్స్ మేరకు తదుపరి క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వానికి రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు

కర్నూలు(అగ్రికల్చర్): 2023 ఖరీఫ్ సీజన్‌కు కరువు మండలాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో తప్పులు ఇతర లోపాలను సరిచేసి 49,890 మంది రైతుల వివరాలను ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయ శాఖ పంపింది. బ్యాంకు ఖాతాలు ఇన్‌వ్యాలీడ్‌గా ఉండటం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు తప్పుగా ఉండటం, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ లేకపోవడం తదితర కారణాల వల్ల దాదాపు 51 వేల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కాలేదు. ఈ ఖాతాలను సరిచేసి పంపాలని గత నెలలోనే ప్రభుత్వం వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు బ్యాంకు ఖాతా వివరాలు సరిచేసిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ బుధవారం ప్రభుత్వానికి పంపింది. ఇన్‌వ్యాలీడ్ ఖాతాలకు సంబంధించి 15,457, ఫెయిల్యూర్స్‌కు సంబంధించి 34,433 బ్యాంకు ఖాతాలను సరిచేశారు. 1,000కి పైగా బ్యాంకు ఖాతాలకు సంబంధించి రైతులు అందుబాటులోకి రాలేదని అధికారులు తెలిపారు. 49,890 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.67.80 కోట్లు విడుదల కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

పెద్దాసుపత్రికి వంద వీల్‌చైర్ల కేటాయింపు



డ్రగ్ స్టోర్‌లో వీల్‌చైర్లను చూపుతున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక పెద్దాస్పత్రికి జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్ఓలు సంయుక్తంగా వంద వీల్‌చైర్లు కేటాయించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ వీల్‌చైర్లను దివ్యాంగులు, వృద్ధుల కోసం ఉన్నతాధికారులు తెప్పించారు. ఎన్నికలు ముగిసిన మేరకు ఇవి ప్రజలకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకుని ఆసుపత్రికి కేటాయించారు. ఈ మేరకు బుధవారం వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. తక్షణమే ఇందులోని పది వీల్ చైర్లను క్యాజువాలిటీకి పంపించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఇతర విభాగాలకు ఎవరికైనా అవసరమైతే ఇండెంట్ తెప్పించుకుని అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

'అడుగంటిన' ఆశలు



☛ ఈ చిత్రంలో బోరు వద్ద దీనంగా కనిపిస్తున్న రైతు రామలింగడు. ఇతడిది గోనెగండ్ల మండలం లింగందిన్నె గ్రామం. లింగందిన్నెతో పాటు దేవనకొండ మండలం చెల్లెచెలిమల గ్రామ పరిధిలోనూ ఇతనికి 3 ఎకరాల పొలం ఉంది. సాగు కోసమని వేసిన రెండు బోర్లలోను నీళ్లు పూర్తి అడుగంటిపోవడంతో విత్తనం వేయలేదు. ఏటా ఈపాటికే వర్షాలు బాగా పడి బోర్లలో నీటి శాతం పెరిగేదని రైతు రామలింగడు తెలిపాడు. ఈ సారి సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని సాగు ప్రశ్నార్థకంగా మారిందని అతడు ఆందోళన వ్యక్తం చేశాడు.

☛ కోసిగి మండలం అత్యంత వెనుకబడిన మండలం. ఈ మండలంలో వర్షాలు తక్కువే. అందువల్ల భూగర్భ జలాలు అట్టడుగుకు చేరాయి. 2023 జూన్ నెలలో భూగర్భ జలాలు 14.94 మీటర్లలోనే ఉన్నాయి. 2024 జూన్ నెలలో 30. 81 మీటర్లలోకి పడిపోయాయి. 2023 జూన్ మాసంతో పోలిస్తే.. 2024 జూన్ మాసంలో 15.87 మీటర్ల అడుక్కు చేరాయి. కోసిగి మండలం వందగల్లు గ్రామంలో భూగర్భ జలవనరుల శాఖ అధికారులు జూన్ నెలలో తీసిన లెక్కల ప్రకారం 41 మీటర్ల లోపల నీళ్లు ఉన్న ట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జూన్ నెల సాధారణ వర్షపాతం 93.3 మిల్లీమీటర్లు కాగా.. 105.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం మేరకు వర్షాలు కురిసినప్పటికీ గత ఏడాది జూన్ మాసంతో పోలిస్తే.. ఈ సారి జూన్ మాసంలో అట్టడుగుకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది.



వెల్దుర్తి మండలం బోగులు సమీపంలో ఎండిపోయిన బావి

పాతాళ గంగ పైకిరానంటోంది. పైనున్న వరుణుడు కరుణించనంటున్నాడు. నిండుకుండల్లా కళకళలాడాల్సిన బావులు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీరులేక వెలవెలబోతున్నాయి. పచ్చని పైర్లతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన పొలాలు బోసిపోయి కనపడుతున్నాయి. సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో ఈ ఏడాది సాగు సాగేనా అనే బెంగ అన్నదాతను వెంటాడుతోంది.

కరుణించని వరుణుడు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వాడుతున్న పైర్లు..ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- జూలైలోనూ నిరాశ కలిగిస్తున్న వర్షాలు
- ఊసేలేని జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాకాలం మొదలై 40 రోజులు గడిచింది. జూన్ మొదటి పక్షంలో వర్షాలు కొంతమేర మురిపించినప్పటికీ తర్వాత ముఖం చాటేయడంతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చుక్క నీరు లేక చెరువులు, కుంటలు, వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. 2023 జూన్‌నెలలో జిల్లా మొత్తం మీద సగటున 7.98 మీటర్లలో ఉన్న భూగర్భ జలాలు 2024 మే నెలలో 10.89 మీటర్లలోకి పడిపోయాయి. మే నెలలో ఆశాజనకంగా వర్షాలు పడటం, జూన్ మాసం మొదటి పక్షం వరకు వర్షాలు పడటం వల్ల మే నెలతో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో 1.85 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయి. అయితే 2023 జూన్ నెలతో పోలిస్తే మాత్రం ఈ ఏడాది 1.06 మీటర్ల మేర అడుగుకు వెళ్లడం గమనార్హం. భూగర్భజలాలు పడిపోతుండటంతో బావులు, బోర్ల కింద పంటలు సాగు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. కోసిగి, ఓర్వకల్లు వంటి మండలాల్లో వెయ్యి అడుగుల మేర బోరు వేసినా గంగమ్మ బయటికి రాని పరిస్థితి. జిల్లాలో 1,14,286 బోరు బావులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల 50 శాతం బోర్లు మరుగున పడ్డాయి.

జలసంరక్షణ పనులకు తావేది?

ఉపాధి హామీ పథకం కింద భూగర్భ జలాలు పెరగడానికి అవసరమైన పనులు చేపట్టాల్సి ఉంది. భూగర్భ జలాలు పెంచేందుకు వీలుగా ఎకరా విస్తీర్ణంలో 10 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో అమృత్ సరోవర్లు నిర్మించాల్సి ఉంది. అర ఎకరం విస్తీర్ణంలో 5 వేల క్యూబిక్ మీటర్ల మినీ అమృత్ సరోవర్‌లు నిర్మించాలి. ఇవేగాక ఫాంపాండ్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే కాల్వలు, చెక్ డ్యామ్‌లు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇస్తుండటం గమనార్హం. ఏటా ఇవే పనులు నిర్వహిస్తుండటంతో ఉపాధిలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడే విధంగా అమృత్ సరోవర్లు, మినీ అమృత్ సరోవర్లు, ఫాంపాండ్ వంటి వాటిని చేపట్టాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశాలు ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదు. ఉపాధి నిధులను భూగర్భ జలాల అభివృద్ధికి దోహదపడే విధంగా ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికీ పైపై పనులు చేస్తూ మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి.

జూలైలో నిరాశ కలిగిస్తున్న వర్షాలు

జూలై నెలలో కూడా వర్షాలు నిరాశ కలిగిస్తున్నాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 12.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెలలో కూడా వర్షాలు లేకపోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జూలై నెలలో వర్షాలు పడితేనే ఖరీఫ్ గట్టెక్కేది. లేకపోతే ఖరీఫ్ సీజన్‌కు గండం పొంచి ఉన్నట్లే. జూలై నెల 10వ రోజుకు చేరినప్పటికీ జల్లులు, తేలికపాటి వర్షాలు మినహా ఇంతవరకు ఒక్క మండలంలో కూడా భూములు బాగా తడిచే వర్షం పడకపోవడం రైతులను ఆందోళన కలిగిస్తోంది. వరుసగా 21 రోజులు వానలు లేకపోతే ఒక డ్రైస్పెల్ కింద పరిగణిస్తారు. 20 రోజులకుపైగా వర్షాలు లేకపోవడం వల్ల ఇప్పటికే ఒక డ్రైస్పెల్ నమోదైనట్లు తెలుస్తోంది.

15 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగునే..

జిల్లాలో 26 మండలాలు ఉండగా.. 16 మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. జూన్ మొదటి పక్షంలో వర్షాలు ఆశాజనకంగా పడినప్పటికీ తర్వాత ముఖం చాటేయడంతో భూగర్భ జలాల్లో పురోగతి లేదు. ఆలూరు, దేవనకొండ, హాలహర్వి, కోడుమూరు, కర్నూలు అర్బన్, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో భూగర్భ జలాల్లో కొంతమేర పురోగతి ఉన్నప్పటికీ కోసిగి, ఆస్పరి, గూడూరు, కౌతాళం, కర్నూలు రూరల్, ఓర్వకల్లు మండలాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. భూగర్భ జలాలు పెరిగితే కూరగాయల పంటల సాగుకు అవకాశం ఉంది. ఇప్పటికీ మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు.



గోనెగండ్ల మండలంలో భూగర్భ జలాలు అడుగంటడంతో పనికి రాకుండా ఉండిపోయిన బోరు

డివిజన్‌ల వారీగా 2023 జూన్‌తో పోలిస్తే.. 2024 జూన్‌లో భూగర్భ జలాల పరిస్థితి ఇది

డివిజన్	2023 జూన్	2024 జూన్
ఆదోని	10.73	11.02
కర్నూలు	7.86	9.26
పత్తికొండ	7.06	7.29

తాగునీటికీ కష్టాలే..

వర్షాకాలం ప్రారంభమై 40 రోజులు గడచిపోయాయి. జూన్ నెల మొదటి 15 రోజుల వరకు ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. ఈ సమయంలో నీటి సమస్య ఉండరాదు. ప్రతి రోజు కాకున్నా మూడు రోజులకోసారైనా తాగునీటిని సరఫరా చేయాలి. కానీ వెల్దుర్తి, కోసిగి, ఓర్వకల్లు, గూడూరు, కర్నూలు అర్బన్, కౌతాళం తదితర మండలాల్లో వారానికి ఒకసారి సరఫరా చేస్తున్నారు. చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే 1.06 మీటర్ల మేర నీటి జలాలు అడుక్కు వెళ్లాయి. దీంతో వందలాది గ్రామాల్లో తాగు నీటి కష్టాలు ఏర్పడ్డాయి.

బోరులో నీళ్లు రావడంలేదు



నాకున్న ఐదెకరాల్లో పత్తి, ఉల్లి, ఆముదం సాగు చేశాను. ఉన్న బోరులో నీళ్లు రావడంలేదు. ఇంతవరకు సరైన వర్షాలు పడలేదు. చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. ఈ నెలలో వర్షాలు పడితే పైర్లు బతుకుతాయి. లేకపోతే పంటలను కోల్పోయినట్లే.

– ఈరన్న, వందగల్లు, కౌసిగి మండలం

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

కర్నూలు(సెంట్రల్): ఆలూరు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. బుధవారం ఆయన కలెక్టర్‌ను చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ఆస్పరి మండలంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, హొళగుందలో రోడ్లను బాగుచేయించాలని, చిప్పగిరిలో హంద్రీనీవా కాలువకు తూము ఏర్పాటు చేసి ఏబీసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయించాలని, హాలహర్విలో జింకల పార్కును ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



కలెక్టర్ పి.రంజిత్‌బాషాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

నూతన ఇసుక పాలసీ ఉచితం కాదు

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీ ఉచితం కాదని, ఇది కార్మికులను మభ్యపెట్టడమేనని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప విమర్శించారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో చెప్పినట్లు ఇసుకను ఉచితంగా ఇవ్వడంలేదన్నారు. టన్నుకు రూ.335 వసూలు చేయడం అన్యాయమన్నారు. గతంతో పోల్చితే రేటు మాత్రమే తగ్గిందని, ఉచితం కాదన్నారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం ఉచిత ఇసుక అంటూ ప్రచారం చేసుకోవడం తగదన్నారు. ఇసుక పాలసీలో రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపునకు సంబంధించి విడుదల చేసిన జీఓ.17ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా కార్యదర్శి డీసీ రెహమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.నల్లన్న, నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఉప కార్యదర్శి రామాంజనేయులు, రేణుక పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

పంచాయత్ అవార్డ్‌కు వివరాల నమోదు

- డీపీఓ టీ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): నేషనల్ పంచాయత్ అవార్డులకు సంబంధించి తొమ్మిది అంశాలపై జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివరాలను ఆన్‌లైన్‌లో పంపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డులకు గానూ రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనరేట్ పలు వివరాలను కోరడంతో జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల నుంచి తెప్పించి పంపుతున్నామన్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయంలో ఈ తొమ్మిది అంశాలపై పెట్టిన ఖర్చు శాతంపై వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజల జీవన విధానం, ప్రజల ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు అందించడం, స్వతహాగా మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవడం, సామాజిక భద్రత, మంచి పరిపాలన తదితర అంశాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు అన్ని గ్రామ పంచాయతీల నుంచి వివరాలను అందాయన్నారు.

సీసీఆర్ కార్డుల జారీని వేగవంతం చేయండి

- ఎరువులు, విత్తనాల నాణ్యతపై పరీక్షలు చేయించండి
- వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్ష సమావేశంలో కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): కౌలు రైతులకు సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఖరీఫ్ పంటల సాగు, సీసీఆర్ కార్డుల జారీపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఖరీఫ్ సాగు స్థితిగతులను వివరించారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో 22,235 సీసీఆర్ కార్డులు జారీ చేయాలనేది లక్ష్యమని, ఇంతవరకు 100 కార్డులు కూడా జారీ చేయకపోవడంపై తగదన్నారు. రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకొని సీసీఆర్ కార్డుల జారీని వేగవంతం చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌ల్లో విత్తనాలు, ఎరువుల పరీక్షలు ఇప్పటి వరకు కేవలం 308 మాత్రమే చేశారని, వీటి సంఖ్యను పెంచాలని సూచించారు. సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాల పరీక్షలు చేయించాలని, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలకు చెందిన విత్తనాల నాణ్యతపై పరీక్షలు చేయించాలని ఆదేశించారు. వేరుశనగ విత్తనాలకు డిమాండ్ ఉన్నందున అదనపు వేరుశనగ కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు డీఓ లెటర్ పెట్టాలని సూచించారు. 2019 ఫిబ్రవరి నాటికి భూములున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ అమలవుతోందని, తర్వాత భూములు పొందిన వారికి పీఎం కిసాన్ రావడం లేదని వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించగా సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంట యాప్‌లో పకడ్బందీగా నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన మూడు మండలాల్లో భూసార పరీక్షలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని, కెమికల్ వ్యవసాయంలో గత తేడాలను గుర్తించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ, మత్స్యశాఖల పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజనేయులు, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, సునీత, అరుణకుమారి పాల్గొన్నారు.

75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): అధిక ప్రొటీన్లు కలిగిన మొక్కజొన్న, జొన్న పశుగ్రాసాల సాగుకు 75 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. పాల ఉత్పత్తిని పెంచుకోవడానికి ఈ పశుగ్రాసాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వం జిల్లాకు 20 టన్నుల పశుగ్రాసం విత్తనాలు కేటాయించిందని, గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. హైబ్రిడ్ జొన్న 5 కిలోల కిట్ పూర్తి ధర రూ.460 ఉండగా.. సబ్సిడీ రూ.345 ఉంటుందని.. రైతులు రూ.115 చెల్లించాలన్నారు. హైబ్రిడ్ మొక్క జొన్న 5 కిలోల కిట్ పూర్తి ధర రూ.340 కాగా.. సబ్సిడీ రూ.255 ఉంటుందని, రైతులు రూ.85 చెల్లించాలన్నారు. రైతులు నాన్ సబ్సిడీ మొత్తాన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. ఒక రైతుకు గరిష్ఠంగా 30కిలోల వరకు ఇస్తామన్నారు.

క్లుప్తంగా

ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో ప్రధాన రహదారి పక్కనే నివాసం ఉంటున్న దూదేకుల చిన్న కుల్లాయి (62) బుధవారం మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మృతుడి ఇంటిపై ఉన్న గూటిలో పావురాలు ఉన్నాయి. వాటికి గింజలు వేసేందుకు మెట్లెక్కి పైకి వెళ్లి వస్తుండగా జారి కింద పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేరు.అరగంట తర్వాత వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

15న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 15 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 10 నుంచి 12 వ తేదీ వరకు చిత్తూరు జిలా పుత్తూరు గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 4 పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు రూ.10 ప్రవేశ రుసుంతో రావాలని తెలిపారు. వివరాలకు 70320 88008 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి తక్కువ ధరకే బియ్యం, బ్యాళ్లు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లు, సూపర్ మార్కెట్లలో తక్కువ ధరకు బియ్యం, బ్యాళ్ల విక్రయించేందుకు చర్యలు తీసుకున్నట్లు జేసీనారపురెడ్డి మౌర్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ బ్యాళ్ల ధర రూ. 181 ఉండగా రూ.160, కేజీ సోనామసూరి (స్టీమ్డ్) రైస్ రూ.55.85 ఉండగా రూ.49, కేజీ సోనామసూరి(రా రైస్) 52.40 ఉండగా రూ. 48కు ఇస్తున్నట్లు తెలిపారు. సీక్యాంపు రైతు బజార్, వెంకటరణ కాలనీ రైతుబజార్, మండి బజార్‌తోపాటు డిమార్టు, జ్యోతిమాల్, మోర్, రిలయన్స్, స్పెన్సర్స్ మాళ్లతో పాటు ఆదోనిలోని రైతుబజార్‌లో తక్కువరేటుకు బియ్యం, బ్యాళ్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

మెరుగైన బోధనకు టీచ్ టూల్ దోహదం



శిక్షణలో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న టీచర్లు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులు మెరుగైన పాఠ్యబోధన చేసేందుకు టీచ్ టూల్ చక్కగా ఉపయోగపడుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ రఫీ, మాస్టర్ ట్రైనర్లు అన్నారు. ఏపీ సాల్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇస్తున్న టీచ్ టూల్ శిక్షణ బుధవారం ముగిసింది. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో జరిగిన ఈ శిక్షణకు 474 పరిశీలకులు హాజరయ్యారు. నగర శివారులోని పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

జనాభా పెరుగుతోంది!

చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం

- ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలి
- కు.నితో ఎన్నో ఉపయోగాలు
- దేశ ఆర్థికాభివృద్ధితో పాటు కుటుంబమూ ఎదుగుదల
- మహిళలకూ ఆరోగ్యంగా మేలు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



బాలింతలతో కిటకిటలాడుతున్న ప్రభుత్వాపత్రి



మహిళలకు కు.ని. ఆపరేషన్ గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అన్నట్టు ఇంట్లో సభ్యులు ఎక్కువైతే వారిని పోషించడానికి కుటుంబ పెద్ద తీవ్రంగా కష్ట పడాల్సి వస్తుంది. పైగా అందరినీ తాను అనుకున్న విధంగా ప్రయోజకులను చేయలేడు. దీనికితోడు ఒక వైపు ఆర్థిక సమస్యలు, మరో వైపు ఆరోగ్య సమస్యలూ వేధిస్తాయి. ఈ ప్రభావం ముందుగా కుటుంబంపై ఆ తర్వాత దేశంపై చూపుతుంది. ఈ నేపథ్యంలోనే జనాభా పెరుగుదల పరిణామాలు, సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 44లక్షల జనాభా ఉంది. ప్రతి సంవత్సరం ఈ సంఖ్య మరింత పెరుగుతోంది. పదేళ్లకు ఒకసారి 3 నుంచి 4 లక్షల జనాభా అధికమవుతోంది. ఈ మేరకు ప్రస్తుతం జిల్లా జనాభా దాదాపు 48లక్షల నుంచి 50లక్షల వరకు ఉండొచ్చని అంచనా. పెరుగుతున్న జనాభా కారణంగా ఒకవైపు భూమి, వారికి ఆహారం, మరోవైపు ఆర్థిక వనరులు తగ్గుతాయి. పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రోత్సహిస్తున్నాయి. అయితే, గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర విభజన జరిగిందన్న సాకుతో కుటుంబ నియంత్రణను నీరుగార్చింది. జనాభాను నియంత్రించాల్సింది పోయి పెంచాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి జిల్లాలో కు.ని ఆపరేషన్లు తగ్గిపోయాయి. వచ్చిన వారికి మాత్రమే ఈ ఆపరేషన్లు చేస్తున్నారు. 2020, 2021 సంవత్సరాల్లో కోవిడ్ కారణంగా కుటుంబ నియంత్రణ పూర్తిగా అడుగంటి పోయింది. ఆ సమయంలో జిల్లాలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా పెరిగింది. ఈ మేరకు జనాభాను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించాయి. చిన్న కుటుంబం..చింతలేని కుటుంబమని చెబుతూ కు.ని ఆపరేషన్లను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీపీ యూనిట్, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలోని పీపీ యూనిట్, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, నంద్యాల జిల్లా ఆసుపత్రి, కోడుమూరు, ఓర్వకల్, పత్తికొండ, వెల్దుర్తి, ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్వహిస్తున్నారు.

కుటుంబ నియంత్రణకు ప్రోత్సాహకాలు

కర్నూలు బోధనాసుపత్రి, నంద్యాల జిల్లా ఆసుపత్రుల్లో ప్రసవానంతరం వెంటనే అంత్రా ఇంజెక్షన్లు బాలింతలకు ఇస్తున్నారు. ఇది కూడా బాలింత, ఆమె కుటుంబసభ్యుల అనుమతి తీసుకుని మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల మళ్లీ మూడేళ్ల వరకు మహిళ గర్భం దాల్చకుండా ఉంటుంది. దీంతో పాటు నిరోద్‌లు, గర్భనిరోధక మాత్రలను ఆయా ఆసుపత్రుల్లో ప్రత్యేక బాక్స్‌ల్లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన పీపీ ఐయూసీడీ చేయించుకున్న వాలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి రూ.5 వేలు ప్రోత్సాహక నగదు ఇస్తున్నారు. వేసక్టమి చేయించుకున్న వారికి రూ.5వేలు, అలాగే పీపీ యూనిట్‌లో కు.ని ప్రోత్సహించే కౌన్సిలర్లకు ఇద్దరికి రూ.2,500ల చొప్పున, పీపీ ఐయూసీడీలను, అంత్రా ఇంజెక్షన్లను ప్రోత్సహించే ఏఎన్ఎం/ఆశలను ఇద్దరిని ఎంపిక చేసి వారికి చెరో రూ.2,500ల చొప్పున, పీపీఐయూసీలను ప్రమోట్ చేసిన వైద్యులకు ప్రథమ బహుమతి రూ.8వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు చొప్పున, వేసక్టమి చేసిన డాక్టర్‌కు ప్రథమ బహుమతి రూ.7వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నారు.

ఐదేళ్లలో కుటుంబ నియంత్రణ సాధన లక్ష్యాలు

సంవత్సరం	లక్ష్యం	లక్ష్య సాధన(శాతం)
2018-19	25,000	17,569(70.28)
2019-20	25,000	16,556(66.22)
2020-21	25,000	7,728(30.91)
2021-22	14,058	7,575(53.88)
2022-23	12,885	9,497(73.71)
2023-24	12,885	8,062(62.57)

కు.నిపై అవగాహన కల్పిస్తున్నాము



జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. కుటుంబ నియంత్రణ పద్ధతులు, ఆపరేషన్లు చేయించుకున్న వారికి ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తున్నాము. గతంలో కోవిడ్ కారణంగా జిల్లాలో కుటుంబ నియంత్రణ నెమ్మదించింది. ఇప్పుడు మళ్లీ ప్రజలు కుటుంబ నియంత్రణ చేయించుకునేలా ప్రోత్సహిస్తున్నాము.

–డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

ఎక్కువ బిడ్డలను కంటే తల్లికి అనారోగ్యం



కుటుంబ నియంత్రణ పాటించకుండా పిల్లలను కంటూ పోతే అది తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కు.ని ఆపరేషన్ను స్త్రీలే కాదు పురుషులు కూడా చేయించుకోవచ్చు. దీనివల్ల ఎలాంటి నష్టమూ ఉండదు. ప్రతి జంటకూ ఒకరు లేదా ఇద్దరు ముద్దు అనే విషయాన్ని ప్రచారం చేయాలి. పెరిగే జనాభా వల్ల అది మన దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 2023లో మన దేశం జనాభాలో చైనాను దాటిపోయింది.

–డాక్టర్ టి. జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

ఆర్‌ఎంపీలు ఇన్‌జెక్షన్లు వేస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి
- గంజిహళ్లిలో బాలుడి ప్రాణాలు తీసిన ఘటనపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

గోనెగండ్ల: ఆర్‌ఎంపీలు ఎవరైనా కాని రోగులకు ఇన్‌జెక్షన్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి హెచ్చరించారు. గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామంలో బడేసాహెబ్ అనే నకిలీ వైద్యుడు వేసిన ఇన్‌జెక్షన్ వికటించి అదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు రాజేష్ మూడు రోజుల క్రితం మృతి చెందాడు. 'నకిలీ వైద్యానికి బాలుడు బలి' శీర్షికతో సాక్షి వెలుగులోకి తెచ్చిన ఈ ఘటనపై ప్రభుత్వ వైద్యాధికారులు స్పందించారు. బుధవారం డిప్యూటీ డీఎంహెచ్ సత్యవతి స్థానిక డాక్టర్ కార్తీక్‌తో కలిసి గంజిహళ్లిలో విచారణ చేపట్టారు. బాలుడి అమ్మమ్మ బోయ బసమ్మతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. 15 రోజుల క్రితం రాజేష్‌కు జ్వరం రావడంతో బడేసాహెబ్ అనే నకిలీ వైద్యుడిని ఆశ్రయిస్తే ఆయన ఇన్‌జెక్షన్ ఇచ్చారన్నారు. మూడు రోజులకు ఇన్‌ఫెక్షన్ అయి చీము, రక్తం కారడంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లితే కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. ఈ సమాచారం ఆధారంగా రాజేష్ మృతికి కారణమైన బడేసాహెబ్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బడేసాహెబ్ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు చెందిన సర్టిఫికెట్లు చూపలేదన్నారు. ఘటనపై విచారణ నివేదికను డీఎంహెచ్‌ఓకు సమర్పించనున్నట్లు తెలిపారు.

మహిళా డాక్టర్‌కు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ వేధింపులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి

ఎమ్మిగనూరు రూరల్: ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ తనను వేధిస్తున్నాడని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మైత్రేయి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసే శివ తన వాహనాన్ని ఆసుపత్రి ఆవరణలో నిలుపుకోవడమే కాకుండా మహిళా సిబ్బందిని బెదిరిస్తూ వస్తున్నాడన్నారు. కొన్ని సార్లు విధులకు సైతం ఆటంకం కలిగిస్తున్నాడని తెలిపారు. ఇప్పుడు ఏకంగా ఓ లేడీ డాక్టర్‌కు వాట్సప్ మేసేజ్‌లు పంపుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. ఆగడాలు భరించలేక బాధితురాలు తన తోటి డాక్టర్లతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ గత ఫిబ్రవరి నెల నుంచి తనను వేధిస్తున్నట్లు బాధితురాలు వాపోయారు. లేడి డాక్టర్ ఫిర్యాదుపై పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు వివరణ కోరగా విచారిస్తున్నామని తెలిపారు.

జీవన నైపుణ్యాలు మెరుగుపరచాలి

గోస్పాడు: భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగుల జీవన నైపుణ్యాలను మెరుగుపరచాలని రాష్ట్ర పరిశీలకుడు దండేపాల్ అన్నారు. నంద్యాల జిల్లాలోని పాణ్యం, గోస్పాడు, నంద్యాల మండలాల్లోని భవిత కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రకాల మెరుగైన విద్యతో పాటు వారిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా విలీన విద్యా విభాగం భవిత కేంద్రాలను సందర్శించి పిల్లల సామర్థ్యాలు, ప్రవర్తనను పరిశీలించారు. సహిత విద్య ఉపాధ్యాయులను కలిసి బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాణ్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును తనిఖీ చేశారు. జిల్లా విలీన విద్య సమన్వయకర్త రఘురాం రెడ్డి, సహాయ సమన్వయకర్త శ్రీనివాసులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(అర్బన్): ఆదోని మండలం ఇస్వీ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి ఉసేని విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన ఘటనకు సంబంధించి ఆదోని సీడీపీఓ, సూపర్‌వైజర్, వర్కర్, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ తెలిపారు. బుధవారం ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి డాక్టర్లను కోరామన్నారు. అక్కడి అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం రెండు అడుగుల ఎత్తులో ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ కూడా లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన వైర్లు కిందకు వేలాడుతుండడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఏపీఎస్ పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీరును కూడా లేఖ ద్వారా కోరామన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. బుధవారం ఎస్టీబీసీ కాలేజీలో హెల్మెట్, మోటార్ వాహనాల చట్టం, దాని కింద రూపొందించిన నియమాలు, శిక్షపరమైన నిబంధనలు, దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలన్నారు. అలాగే విద్యార్థులు ర్యాగింగ్‌జోలికి వెళ్లకూడదన్నారు. ర్యాగింగ్‌లో పాల్గొన్నా, ప్రోత్సహించినా కఠిన శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ఎస్టీబీసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, కరస్పాండెంట్ ఆర్ఆర్‌డీ సజీవరాజు, ట్రాఫిక్ సీఐ గౌతమి, టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, మోటర్ వెహికల్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణుల దాడి

- గొర్విమానుపల్లె సమీపంలో ఘటన



శ్రీరాములు తలకు తీవ్ర గాయమైన దృశ్యం

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నారు. అనంతపురం జిల్లా యాడికి మండలం గుడిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దండు శ్రీరాములు ఎన్నికల సమయంలో చురుగ్గా పని చేశాడు. బుధవారం ఉదయం బైక్‌లో రోజు మాదిరిగానే కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెకు నాపరాతి గనిలో కూలీ పనికి వచ్చాడు. సాయంత్రం పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా బాటసుంకులమ్మ ఆలయం సమీపంలో కాపు కాసిన టీడీపీ శ్రేణులు రహీం,అశోక్, భాస్కర్, హరి తదితరులు వెంబడించి వేటకొడవళ్లతో తలపై దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడు అక్కడికక్కడే కుప్ప కూలిపోవడంతో మృతి చెందాడని భావించి నిందితులు వెళ్లిపోయారు. కొద్దిసేపటికి అటుగా వచ్చిన అదే గ్రామానికి చెందిన కూలీలు శ్రీరాములును గుర్తించి చికిత్స కోసం కొలిమిగుండ్లలోని పీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో సీఐ గోపీనాథ్‌రెడ్డి విచారణ చేపట్టారు. మెరుగైన చికిత్స కోసం బాధితుడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మంత్రి బీసీ స్వగ్రామంలో వైఎస్సార్ విగ్రహ ధ్వంసం



యనకండ్లలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసి తారు పూసిన దృశ్యం

బనగానపల్లె : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి స్వగ్రామమైన నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని యనకండ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండు చేతులు ధ్వంసం చేసి, ముఖానికి తారు పూసి పైశాచిక ఆనందం పొందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వైఎస్సార్ విగ్రహం పక్కనే వాటర్‌ప్లాంట్‌పై ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫొటోతో పాటు, రహదారి శిలాఫలకం పైనా తారును పూయడం గమనార్హం. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు చోట్ల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలోనూ పోలీసులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా బత్తులూరుపాడు గ్రామంలోని మినరల్‌వాటర్ ప్లాంట్‌పై ఉన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫొటోపైనా తారు పూశారు.

అతిసారంపై ప్రజలను అప్రమత్తం చేయండి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.ప్రవీణ్‌కుమార్



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఓర్వకల్లు:అతిసార వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.తాండ్రపాడు, టీవీ-9 కాలనీలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అతిసారపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుకొని అవసరమైన వారికి ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అధిక డీహైడ్రేషన్‌కు గురైన వారిని సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు తరలించి చికిత్స అందేలా చూడాలన్నారు. తర్వాత అక్కడే జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాఘవులు, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు



స్వామి సన్నిధిలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ క్యాడర్ 2023 సంవత్సర ఐఏఎస్ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఐఏఎస్ అధికారులు ఉమాహరినాథ్, అజ్మీర్ సంకీత్‌కుమార్, గరిమా నారులా, మాల్వియా, అజయ్ యాదవ్, శేష్ఠ, మనోజ్‌లకు ఆలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ట్రైనీ కలెక్టర్లు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక సేవలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో ట్రైనీ కలెక్టర్లకు వేదపండితులు వేద మంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

పచ్చదనం పెంచుదాం

- డీపీఓ నాగరాజునాయుడు
- నన్నూరులో హరితహారానికి శ్రీకారం



మొక్కలు నాటుతున్న డీపీఓ నాగరాజునాయుడు

ఓర్వకల్లు: ప్రతి గ్రామ పంచాయతీలో పచ్చదనం పెంచుదామని జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి నాగరాజునాయుడు పిలుపునిచ్చారు. బుధవారం నన్నూరు పంచాయతీ పరిధిలోని రాగమయూరి కాలనీలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జీవరాశుల మనుగడకు మొక్కల పెంపకం చాలా అవసరమన్నారు. ప్రతి పంచాయతీలో 200 మొక్కలు నాటాలని దిశానిర్దేశం చేశారు. పర్యావరణ పరిరక్షణలో వృక్షాలు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక పోకడలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని తద్వారా జీవనశైలిలో సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటి పెంచాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.